


# రమణ భాస్కర

ఆధ్యాత్మిక పక్షపత్రిక

ఎడిటింగ్ : శ్రీమతి P.H.V. సత్యవతి (హైమ)

05-12-2000

3



## శ్రీ రమణ క్షేత్రం - జిన్నూరు

పశ్చిమ గోదావరి జిల్లా - ఆంధ్రప్రదేశ్

## సద్గురు శ్రీనాన్న గారి అనుగ్రహ భాషణములు

| | | |
|---|---|---|
| 07-12-2000 గురువారం | కాపవరం | గీతా మందిరం |
| 09-12-2000 శనివారం | విశాఖపట్నం | డైరీ ఫారంనకు, జూకు మధ్యగల పాత నర్సరీ సైటు,(NH 5 ప్రక్కన) మ. గం.2-00 ప్రవచనము, సా. గం.6-00 దీపోత్సవం |
| 12 to 17-12-2000 | | అరుణాచలం క్యాంప్ ది.14-12-2000 శ్రీ నాన్నగారు ఆశ్రమం గృహప్రవేశం |
| 24-12-2000 ఆదివారం | జిన్నూరు | శ్రీ రమణ క్షేత్రం |
| 05-1-2001 శుక్రవారం | గరగపర్రు | |
| 10-1-2001 బుధవారం | జిన్నూరు | శ్రీ రమణ జయంతి మహోత్సవము శ్రీరమణ క్షేత్రం |
| 21-1-2001 ఆదివారం | రాజమండ్రి. | ఉమా రామలింగేశ్వరస్వామి కళ్యాణ మండపం జాంపేట |

### తిరువన్నామలైలో **శ్రీనాన్నగారు ఆశ్రమం** గృహప్రవేశ మహోత్సవం

శ్రీ రమణాశ్రమానికి ఒక కిలోమీటరు దూరంలో రమణ భక్తులు, సద్గురు శ్రీ నాన్నగారి శిష్యులు 26 మంది కలసి రెండు అంతస్థుల భవనము నిర్మించుకున్నారు. ఆ భవనానికి **శ్రీ నాన్నగారు ఆశ్రమం** అని నామకరణం చేసినారు. సద్గురు శ్రీ నాన్నగారు సమక్షంలో భగవాన్ శ్రీ రమణ మహర్షి తమ్ముని కుమారుడు మరియు రమణాశ్రమం మాజీ అధ్యక్షులు అయిన స్వామి రమణానంద సరస్వతి (వెంకట్రామన్) గారు ది. 14-12-2000 గురువారం ఉదయం గం. 7-00 ని. లకు గృహప్రవేశం చేయుదురు.



ఓం నమోభగవతే శ్రీరమణాయ

# రమణ భాస్కర



సంపుటి : 6 సంచిక : 3 పుష్పం : 08-10 5-12-2000



**RAMANA BHASKARA**

**TELUGU SPIRITUAL FORTNIGHT MAGAZINE**

PAGES : 16

**VOL: 6 ISSUE: 3**

EDITOR
**P. S. RAMA RAJU**

EDITING
**P.H.V. SATYAVATHI (HYMA)**

**SUBSCRIPTION**
YEARLY : RS. 140
Each copy Rs. 10

ADDRESS
**RAMANA BHASKARA**
SRI RAMANAKSHETRAM
JINNURU - 534 265
W.G.Dt., A.P.

**PUBLISHER**
P.S.RAMARAJU
LAKSHMI MODERN RICE MILL
ULLAMPARRU - PALAKOL
☎ 08814 - 24589, 24689

**PRINTER**
SHRIRAM GRAPHICS
BANK STREET - PALAKOL
☎ 08814 - 22438


## మానసిక కాలుష్యానికి మూలం - కృత్రిమ వ్యక్తిత్వం

మనస్సుకు ఆలోచించటం సహజ లక్షణము. మన నిత్య జీవితంలో ఆలోచనకు చోటు ఉన్నది. దైనందిన కార్యకలాపాలు చేసుకొనుటకు, భాష, శాస్త్రములు, కళలు, నేర్చుకొనుటకు ఆలోచన అవసరము. ఆలోచన పరిధి అంతవరకే కాని మనము వ్యక్తిత్వము కేంద్రముగా పెట్టుకొని, దానినుండి వచ్చే ఆలోచనల ద్వారా ఇతరులతో సంబంధము పెట్టుకొనుటకు ప్రయత్నించుచున్నాము. ఒక వ్యక్తిత్వమునకు, మరొక వ్యక్తిత్వము ఘర్షణకు కారణమగును. ఇతర వ్యక్తుల మీద ఒక స్థిరమైన అభిప్రాయము ఏర్పరచుకొని, ఆ అభిప్రాయాల కేంద్రం నుంచి మనం ఆలోచించినప్పడు, మానసిక సంఘర్షణ మొదలవుతుంది. మానసిక సమస్యలను, గతజ్ఞాపకాలనుండి వెలువడిన ఆలోచనల ద్వారా పరిష్కరించుకొనలేము. అట్టి ప్రయత్నము మానసిక సమస్యలను మరింత జటిలం చేస్తుంది. ఆలోచన ద్వారా మానసిక సమస్యలను పరిష్కరించుకోవాలనే ధోరణివల్ల, మానసిక అశాంతి ఎక్కువవుతుంది.

మానసిక సమస్యలు నిత్య జీవితంలో ఎదురైనప్పడు, నిశ్చల మనస్సుతో పరిశీలన జరిపితే, ఆ సమస్య మనకు సంపూర్ణముగా అవగాహనమై, మరల సమస్య ఎప్పడూ తలెత్తదు. వ్యక్తిత్వమే మానసిక కాలుష్యానికి మూలం గనుక, నిశ్చలమనస్సుతో వ్యక్తిత్వాన్ని విచారణ చేసి, మానసిక కాలుష్యం నుంచి విముక్తి పొందండి.

....ఎడిటర్

### సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు


05-11-2000, జువ్వలపాలెం ........ 2
08-11-2000, చించినాడ ........ 7
14-11-2000, భీమవరం ........ 11

# ధర్మం అంటే దానం కాదు - అది క్రమశిక్షణతో కూడిన ఆధ్యాత్మిక జీవన విధానం

ది. 05-11-2000న జువ్వలపాలెంలోని గీతామందిరం కమిటీవారు ఏర్పాటు చేసిన ఆధ్యాత్మిక వేదికపై సద్గురు శ్రీ నాన్నగారు ప్రసంగించారు.

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ధర్మం అంటే కేవలం దానం కాదు, అది ఒక జీవనవిధానం. మనం ఎలా ప్రవర్తించాలి, ఎక్కడ ఎలా జీవించాలి అని ఒక క్రమ పద్ధతిని చెప్పేదానిని ధర్మం అంటారు. మనం ధర్మాన్ని ఆచరించాలి లేకపోతే మనకు ఆత్మజ్ఞానం కలుగదు. ఎప్పుడైతే ధర్మం క్షీణించిందో అప్పుడు ధర్మాన్ని పునరుద్ధరించటంకోసం భగవంతుడు అవతరిస్తూ ఉంటాడు అని చెపుతారు. మనం ధర్మానికి కట్టుబడి ఉంటే సమాజ వ్యవస్థ బాగుంటుంది, సమాజం అంతా శాంతిగా ఉంటుంది. మతాన్ని మార్చుకొంటే మనకు జ్ఞానం కలుగదు. మనస్సును మార్చుకోవాలి, మారుమనస్సు పొందాలి. మన మనస్సు, మాట, చేత ఏకంగా ఉంటే మనలను జ్ఞానం వరిస్తుంది. ఈ మూడు ఏకంగా ఉంటే త్రికరణశుద్ధి అంటారు. ఎంతపాండిత్యం ఉన్నా, ఎంతధనం ఉన్నా, ఎంత అధికారం ఉన్నా త్రికరణశుద్ధిలేనివారికి జ్ఞానం కలుగదు. జ్ఞానం కలిగిన తరువాత ఎవ్వరైనా ఒకటే. గుణాలలో తేడా ఉంటుంది, మనస్సులో హెచ్చు తగ్గులు ఉంటాయి కాని జ్ఞానం కలిగిన తరువాత అంతా సమానంగానే ఉంటుంది. ప్రేమ ప్రేమకోసమే, భక్తి భక్తికోసమే, సేవ సేవకోసమే చేసేవారికి ఆత్మజ్ఞానం కలుగుతుంది. ఏదోకోరికలు పెట్టుకొని భగవంతుని ప్రార్థిస్తే ఆభక్తి కోరికకే పరిమితం అవుతుంది. కోరికలు ఏమీ లేకుండా భగవంతుడిని మనం ప్రేమించాలి. ఈశ్వరుడు మనకు ఏదో చేస్తాడనికాదు, ఆయన చేసినా చేయకపోయినా ఆయన మీద భారంవేసి, ఆయన పాదాలను ఆశ్రయించి జీవించటమే నిజమైన భక్తి. కోరికలు పెట్టుకొని భగవంతుడిని ప్రార్థిస్తే ఆకోరికలు నెరవేరవచ్చును కాని మనస్సుకు అంతర్దృష్టి కలుగదు. మనస్సును ఎంత బాగుచేసుకొంటే అంత మనం పవిత్రులమవుతాము. పవిత్రత ఎప్పుడైతే కలిగిందో అప్పుడు హృదయంలో నివాసంగా ఉన్న ఈశ్వరుడు మనకు ప్రత్యక్షమవుతాడు.

వారు మంచివారు, వీరు చెడ్డవారు అంటారు. మీకు మంచిగా కనిపించిన వారు ఇంకొకరికి చెడ్డగా కనిపించవచ్చు, ఇంకొకరికి మంచిగా కనిపించినవారు మీకు చెడ్డగా కనిపించవచ్చు. వారు ఎక్కువవారు, వీరు తక్కువవారు అంటారు. ఇవి అన్నీకూడా తలంపులే. ఒక్క సత్యం తప్పించి అన్నీకూడా తలంపులే. ఇవి అన్నీకూడా నేను అనే మొదటి తలంపు మీద ఆధారపడి ఉన్నాయి. ముందు మనకు నేను అనే తలంపు వస్తుంది. అది దేహంతో తాదాప్యం పొందుతుంది. ఆ నేను అనే తలంపును ఉపసంహరిస్తే అది దాని మూలంలోనికి వెళ్ళి అణిగిపోతుంది. అప్పుడు దానిమీద ఆధారపడిన ఇతర తలంపులు

కూడా అణిగిపోతాయి. హృదయంలో నీ మనస్సును నిలకడగా నిలబెట్టి ఉంచటమే భక్తి, అదే యోగం, అదే నిష్కామ కర్మ అని చెప్పారు. జ్ఞానం అనేది ఎవరో ఒకరి సొమ్ముకాదు. జ్ఞానానికి అందరూ వారసులే అయితే మీరు ఏమతంలో ఉన్నా, ఏ కులంలో ఉన్నా, ఏ ప్రాంతంలో ఉన్నా చిత్తశుద్ధి కలగాలి. చిత్తశుద్ధి ఎవరికి కలుగుతుంది? మనం చేసే పని స్వార్థం లేకుండా చేయటం వలన మనకు చిత్తశుద్ధి కలుగుతుంది, త్రికరణశుద్ధి ఉన్న వారికి చిత్తశుద్ధి కలుగుతుంది. చిత్తశుద్ధి అనేగేటు ద్వారానే మనం మోక్షం పొందాలి. రాగద్వేషముల వలన మిధ్యానేను విజృంభిస్తుంది అందువలన సమానదృష్టి కలిగి ఉండాలి. అవసరం లేని మాటలు మాట్లాడకూడదు. అవసరం లేని మాటలు మాట్లాడటం వలన మిధ్యానేను పెరుగుతుంది. మన అందరికి మాటలు చెప్పటం చేతనవునుగాని వినటం చేతకాదు. కొంతమంది శ్రద్ధగా వింటారు, చాలా తక్కువగా మాట్లాడతారు. అది బుద్ధిమంతుల లక్షణం. మీరు ఏమీ చెప్పనక్కరలేదు మాకు అన్నీ తెలుసుఅని కొంతమంది అంటారు. అది వారి అహంకారానికి గుర్తు. ఎవరైనా ఏదైనా చెప్పినప్పుడు అందులో మంచి ఉంటే తీసుకోవచ్చు, ఆమాట ఉపయోగపడదు అనుకొంటే దానిని వదిలివెయ్యాలి అంతేగాని ఆ మాట గురించి తర్కం అనవసరం. తర్కం వలన మన మనస్సు మలినమవుతుంది. ప్రతీది మనం గుర్తుపెట్టుకోకూడదు. మనం ఎన్ని మాటలు విన్నా అందులో ముఖ్యమైన మాటలు తీసుకొని వాటిని గుర్తుపెట్టుకోవాలి. ఆమాటలు మనకు ఆధ్యాత్మికంగా ఎంత వరకు ఉపయోగపడతాయి అని జాగ్రత్తగా చూసుకోవాలి. మనకు భౌతికంగాగాని, ఆధ్యాత్మికంగాగాని ఉపయోగపడే మాటలను మన బ్రెయిన్‌లో పెట్టుకోవాలి. మనం మాట్లాడే మాట గురించి తెలుసున్నా కొంతమంది నిర్మలంగా, నిశ్శబ్దంగా ఉంటారు. అడిగితే దానిగురించి చెపుతారు, అడగకపోతే చెప్పరు. అది లోతు గుండెకలవారి లక్షణం. మనస్సుకు ఇతరులు ఉన్నారు, ఆత్మకు ఇతరులు లేరు. మీ మనస్సు ఏదిచేసినా అది ఇతరులకు తెలియాలి అనుకొంటుంది దానివలన అజ్ఞానం పెరుగుతుంది, మరణానంతరం నరకం సిద్ధమవుతుంది. అహంకారం అంటే సముద్రంలో ఉన్న బుడగలాంటిది. ఆత్మ అంటే సముద్రం. లోపల హృదయంలో ఉన్న సముద్రంలోనుండే ఈ అహంకారమనే బుడగ వచ్చింది. భగవాన్ చెప్పేది ఏమిటి అంటే ఆ బుడగ కూడా నీరే. బుడగను బుడగగా చూడకు నీరుగా చూడు ఆటెక్నిక్ నేర్చుకో. దానికొక ఆకారం ఏర్పడింది కాబట్టి బుడగ, బుడగ అంటున్నావు. అది బుడగగా ఉన్నప్పుడు కూడా అది నీరే. అలాగే లోకంలో ఉన్న నామరూపములను చూసినప్పుడు కూడా వాటికి ఆధారంగా ఉన్న బ్రహ్మంనే చూడు. ఉన్నది బ్రహ్మమే అది తప్పించి ఏమీ లేదు. ఈ పనిచెయ్యండి మీకు పుణ్యం వస్తుంది అంటే పనిచేస్తాము. అపుణ్యాన్ని విడిచిపెట్టి చిత్తశుద్ధికోసం

పనిచెయ్యండి అని చెపితే ఎవరూ పనిచెయ్యటంలేదు. స్వార్థంతో పనిచేసిన వాడికి ఫలం అందుతుందిగాని చిత్తశుద్ధిరాదు. స్వార్థం లేకుండా పనిచేస్తే ఫలం అందుతుంది, చిత్తశుద్ధి కలుగుతుంది. ఈ రహస్యం మనకు తెలియటంలేదు.

మన మనస్సు నిర్మలంగా ఉండాలి, నిశ్చలంగా ఉండాలి. అవినయం రాకుండా చూసుకోవాలి. ఎవడికైతే వినయం ఉందో, ఎవడిలో అయితే పవిత్రత ఉందో, ఎవడి చూపులో శాంతి ఉందో వాడు ప్రకృతిని నువ్వుదారి ఇవ్వమని అడగనక్కరలేదు, ప్రకృతే వాడికి నమస్కరించి మోక్షం పొందటానికి దారి ఇస్తుంది. అసలు ఆలోచనలో ఆడంబరం లేకపోతే మాటలో, చేతలో ఆడంబరం ఉండదు. మనల్నిమనం బాగుచేసుకోవాలనే సంకల్పం ఉండాలి. ఎవరోవచ్చి మనలను బాగుచేస్తారు అని కనిపెట్టుకొని ఉండకూడదు. హృదయపూర్వకంగా మన ప్రయత్నం మనం చేసుకొంటూ ఉంటే ఈశ్వరానుగ్రహం దానంతట అదే వస్తుంది. నీదైనందిన జీవితంలో నీమాటలోగాని, నీ చేతలోగాని, నీ ఆలోచనలోగాని దేహగతమైన నేను కలవకుండా చూసుకోవాలి. వ్యక్తిభావన యొక్క విజృంభణ లేకుండా చూసుకోవాలి. దేనినైతే పోగొట్టుకోవాలి అనుకొంటున్నారో అది పెరగకుండా చూసుకోవాలి. నేను అనే తలంపు ఉంటే అంతా ఉంది. అది లేకపోతే ఏదీ లేదు. ఈ నేను ఉన్నంతసేపు నీవు ఏదో శాస్త్రాలు చదివి ఈ లోకం నిజంకాదు అనుకొన్నా నిజంగానే కనిపిస్తుంది. ఈ లోకం ఎంతకాలం అయితే నిజంగా కనిపిస్తుందో అంతకాలం నీకు దు:ఖం అశాంతి తప్పదు. నీవు దానం చెయ్యి, ధర్మం చెయ్యి, యోగం చెయ్యి, ఇక్కడ నుండి కాశీ పారిపో నీవు ఏది చేసినా మిధ్యానేను ఉన్నంత సేపు నీకు దుఃఖం తప్పదు. ఇదే అజ్ఞానం. ఈ సమస్యను పరిష్కారం చేసుకో. అజ్ఞానం అనేది దీర్ఘరోగం. దీనికి భౌతికంగా రెమిడీ ఏమీ లేదు. ఇంజక్షన్ చేసుకొంటే ఇది తగ్గిపోతుంది, ఆపరేషన్ చేయించుకొంటే తగ్గిపోతుంది అనేటటువంటి భౌతికమైన పరిష్కారం దీనికి లేదు. ఈ అజ్ఞానమనే రోగం ఎలా తగ్గుతుంది అంటే నువ్వు ఎవరివో నువ్వు తెలుసుకోవటం వలన ఈ అజ్ఞానం అనే రోగం తగ్గుతుంది గాని లేకపోతే ఇది నీకు దారి ఇవ్వదు. విరోధులు, స్నేహితులు నీమనోకల్పితం, అవి నూటికి నూరుపాళ్ళు అసత్యం. ఏదైతే అసత్యమో దాని వెంటపడి వేలాది జన్మలు నీ టైము అంతా పాడుచేసుకొంటున్నావు. మీ ఇంటికి ఎవరైనా కష్టం చెప్పకోవటానికి వస్తే ఆ మాటలు శ్రద్ధగా, ప్రేమగా వింటే మందులతో సంబంధం లేకుండా వారి ఆందోళన 50% తగ్గుతుంది.

నీ హృదయంలో ఉన్న ఈశ్వరుడే నిజమైన దేవుడు. వైకుంఠములో ఉన్న నారాయణుడు, కైలాసంలో ఉన్న శివుడు నిజంకాదా అంటే నీ మనస్సు ఎంతనిజమో వారు కూడా అంతే నిజం. హృదయంలో ఉన్న ఈశ్వరుడు ఒక్కడే పారమార్థిక సత్యం.

05-12-2000

హృదయంలో ఉన్న ఈశ్వరుడి దగ్గరకు వెళ్ళటానికి కాపలాదారులు ఉండరు. నీవు డైరెక్టుగా వెళ్ళి అక్కడ లయం అవ్వవచ్చు. ఈశ్వరుడు లోపల ఉంటే నీవు ఏమిచేస్తున్నావు అంటే ఆయన కోసం బయట వెతుకుచున్నావు. ఎందుచేతనంటే మీ ఇంద్రియాలకు బైటచూపు అలవాటు అయిపోయింది. ముందులోచూపు అలవాటు చేసుకోండి. లోచూపు కలిగితే ధైర్యం పెరుగుతుంది. ఏదైనా ఒక మంచిపని చేయాలంటే తెలివితేటలు సరిపోవు. దానికి తగిన ధైర్యం ఉండాలి. నీకు లోచూపు కలిగినప్పుడే ధైర్యం కలుగుతుంది. నీకు లోచూపు లేదు అనుకో పిరికితనం నిన్ను వెంటాడుతుంది. నీకు లోచూపును అలవాటు చేసేవాడే నిజమైన గురువు. లోకంగోల నాకు ఏల, నాకు కావలసింది ఈశ్వరునిపాదాలు, శాశ్వత శాంతి నాకుకావాలి అనే స్థిర చిత్తం ఉన్నటువంటి వాడికి మాత్రమే సత్యవస్తువు దర్శనం ఇస్తుంది. దేహం ఎలా వచ్చిందో అలాగే పోతుంది. సుఖం, దుఃఖం ఎలా వచ్చాయో అలాగే పోతాయి. ఏదీ శాశ్వతం కాదు. సుఖ, దుఃఖాల మధ్యన నీవు ఎవరో నీవు తెలుసుకోవటానికి ప్రయత్నించు. దేహప్రారబ్ధాన్ని బట్టి ఎన్నో హెచ్చుతగ్గులు వస్తూ ఉంటాయి అవి అన్నీ తలంపులే. ఈ తలంపులకు, గుణాలకు, ప్రకృతికి అతీతమైన వస్తువు ఒకటి నీ హృదయంలో ఉంది. దానిమీద నీ దృష్టిని కేంద్రీకరించు. సత్యాన్ని ఒక నామానికి, ఒక రూపానికి పరిమితం చేయకూడదు. భగవాన్ జ్ఞాని అంటే ఆయన దేహం జ్ఞాని కాదు. మనకు దేహబుద్ధి ఉంది కాబట్టి ఆయన కూడా దేహమే అనుకొంటున్నాము. నీకు మనస్సు తెలుస్తోంది. మనస్సు బయటనుండి రావటం లేదు, లోపల నుండే వస్తోంది. దాని మూలాన్ని వెతకటమే అన్వేషణ. మనమాట, చేత, తలంపు జ్ఞానపరంగా ఉండాలి. అప్పుడు జ్ఞానం రాక ఏంచేస్తుంది. అనవసరమైన మాటలు ఎవరైనా మాట్లాడుతుంటే అది జ్ఞానమా అనేవారు భగవాన్.

మీ ప్రారబ్ధాన్ని బట్టి బాగా ఐశ్వర్యం, చదువు వస్తాయి అనుకోండి, వస్తేరానియ్యండి, చెడ్డ ఏమీలేదు. మీరు వాటితో తాదాప్యం చెందవద్దు. వాటితో తాదాప్యం పొందితే మోక్షాన్ని మిస్ అయిపోతారు జ్ఞాపకం ఉంచుకోండి. మీరు ఆత్మ. ఈ గౌరవాలు, అగౌరవాలు, చదువు, ధనం ఇవి అన్నీ నిజం కాదు. మీరు కానిదానితో తాదాప్యం పొందటం వలన మీకు ప్రమాదం వచ్చిపడుతుంది. మోక్షం మీ హృదయంలో రెడీగా ఉంది. ఈ తప్పుడు తాదాప్యంపోతే సరిపోతుంది. తప్పుడు తాదాప్యం తొలగించుకోవటానికే సాధన. దేహం, ఇంద్రియాలు, మనస్సు ఈ లోకం అంతా జడం. ఇవి అన్నీ ఉన్నట్లు మనకు కనిపిస్తున్నాయి. దేని ప్రకాశం వలన ఇవి అన్నీ మనకు కనిపిస్తున్నాయో ఆ ప్రకాశమే జ్ఞానం. మీరు దేహాన్ని వదిలించుకోవటం కాదు, దేహం ఉండగా దేహాభిమానాన్ని వదిలించుకొంటే ఇప్పుడే ఇక్కడే మోక్షశాంతి మిమ్మల్ని వరిస్తుంది. దేహాభిమానం ఉన్నంతకాలం బాధలు, తిప్పలు తప్పవు. ఈ శరీరం పడిపోతే

బాధలు ఉండవు అనుకోవద్దు. మీరు అందరూ చాలా నిల్వలో ఉన్నారు రాబోయే జన్మలో అనుభవించటానికి తిప్పలు కుప్పలుగా ఉన్నాయి. దేహాభిమానాన్ని వదిలించుకొంటే తిప్పలు ఎన్ని ఉన్నా అన్నీ కూడా కాలిబూడిద అవుతాయి. ఈ దేహాభిమానాన్ని పోగొట్టుకోవటం అంత తేలికకాదు ఎందుచేతనంటే అదే మనం అనుకొంటున్నాము. ఒక్క బ్రహ్మం తప్పించి మిగిలినవి అన్నీ మనస్సుయొక్క కల్పితాలు. మనస్సు కల్పించినవి కాబట్టి అవి మనస్సుకు సత్యంగానే కనిపిస్తాయి. అందుచేత వాటిని నువ్వు విడిచిపెట్టలేకపోతున్నావు.

మనం పనిచేసేటప్పుడు ఎలా ఆలోచిస్తున్నాము అంటే ఈ పనిచేయటం వలన మనకు ఏమికలిసివస్తుంది, ఇందులో ఎంత పేరువస్తుంది అని చూస్తున్నారు. ఫాల్స్ సెంటర్‌లో అంటే మొదటి తలంపులో కూర్చొని పనిచేస్తున్నాము. మొదటితలంపును సంతృప్తి పరచటానికి పనిచేస్తున్నాము దానివలన మొదటి తలంపు పెరిగిపోతుంది. మీకు జ్ఞానం కావాలంటే ఈశ్వరుడు సంతోషించే పనులు చేయాలి. రైట్‌సెంటర్‌లో కూర్చొని పనిచేయాలి అంటే ఈశ్వరుని గుర్తులో పెట్టుకొని పనిచేయాలి. ఈశ్వరుని కేంద్రంగా పెట్టుకొని పనిచేయటం వలన అజ్ఞానం పల్చబడి కాలి బూడిద అవుతుంది. లోకం గొడవలలోనికి వెళ్ళకండి. వాడు అలా పనిచేస్తున్నాడు, వీడు ఇలా పనిచేస్తున్నాడు అంటే అది జ్ఞానమా? వాడి వాసనలను బట్టి వాడు పనిచేస్తూ ఉంటాడు. ఆ గొడవలు వద్దు. ఈశ్వరుడు మీకు ఏది ఆదేశించాడో చూసుకొని ఈశ్వరుడి పాదాలను ఆశ్రయించి పనిచెయ్యండి. మా అత్తగారికి చాలా సేవచేసాను గుర్తింపు లేదు అంటారు. అత్తగారి అహంకారం గుర్తిస్తే ఎవరికి కావాలి, గుర్తించకపోతే ఎవరికి కావాలి, అసలు ఈశ్వరుడు గుర్తించాలి. అత్తగారి అహంకారం గుర్తిస్తే మోక్షం వస్తుందా? ఈశ్వరుడు గుర్తిస్తే మోక్షాన్ని ఇస్తాడు. మనకు ఈశ్వరుడు కేంద్రం అన్న విషయం మర్చిపోయాము. అత్తగారు గుర్తించాలి అని గొడవలో పడ్డాము. ఆ బొమ్మ గుర్తించాలి అని ఈబొమ్మ గోల. ఇదే సంసారం. గుర్తించటంకంటే గుర్తించకుండా ఉంటేనేమంచిది. గుర్తించటం వలన వారుజ్ఞాపకం వస్తారు. గుర్తించకపోతే భగవంతుడే చూసుకొంటాడు. సాధన చేసేటప్పుడు లోపల ఉన్నవి బయటకు వస్తాయి. వాటిని భరించగలగాలి. లోపల ఉన్న వాసనలు నిన్ను పీడించకుండా బయటకు వెళ్ళవు. దానికి సిద్ధపడితేనే నీవు సాధనచెయ్యి. ఆధ్యాత్మికంగా పురోగతి సాధించాలంటే ఇతరులలో ఉన్న పొరపాట్లను మీరు చూడకండి. మీలో ఉన్న దోషాలను చూసుకొని వాటిని తొలగించుకోండి. అది సాధనలో అత్యంత ముఖ్యమైన భాగం. ఇతరుల పొరపాట్లను చూడటం అలవాటు చేసుకొంటే మీ దోషాలను చూసుకోవటం మిస్ అయిపోతారు. మరణానంతర జీవితంలో అయ్యో ఎంతకాలం పాడుచేసుకొన్నాము, ఎంతనష్టపోయాము అని మీరు విలపించవలసి వస్తుంది.

05-12-2000

# ఉత్తమోత్తమమైన సిద్ధి ఆత్మసాక్షాత్కారం

ది. 08-11-2000న చించినాడలోని గీతామందిరం కమిటీవారి ఆహ్వానం మేరకు ఏర్పాటుచేసిన ఆధ్యాత్మిక వేదికపై సద్గురు శ్రీ నాన్నగారు ప్రసంగించారు.

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

సిద్ధులు మోక్షం రావటానికి ఆటంకాలా అని ఒకరు భగవాన్‌ను అడుగుతున్నారు. భగవాన్ ఏమి చెపుతున్నారు అంటే అన్నింటికంటే ఉత్తమోత్తమమైన సిద్ధి ఆత్మసాక్షాత్కారం. అది మర్చిపోవద్దు. మిగిలిన సిద్ధులు కలిగినా అవి స్వప్నంతో సమానము. మిగిలిన సిద్ధులు నీకు కలిగినాయి అనుకో, ఆత్మసాక్షాత్కారం మర్చిపోయారు అనుకో మీరు గమ్యాన్ని తప్పిపోతారు. మనోనిగ్రహం లేనివాడికి ఆధ్యాత్మిక బలం రాదు. మనోనిగ్రహం వస్తే మనస్సు అంతర్ముఖమవుతుంది, మనో నిగ్రహం లేకపోతే మనస్సు బాహ్యముఖానికి వెళ్ళిపోతుంది. మనస్సు బాహ్యముఖానికి వెళితే అహంకారం అవుతుంది, మనస్సు అంతర్ముఖం అయితే ఆత్మ అవుతుంది. మనోనిగ్రహం ఉన్నవాడు జీవితాన్ని భగవంతుడు ఇచ్చిన వరం క్రింద తీసుకొంటాడు. కొంతమంది ఏదోపుట్టాము, ఏదో బతుకుచున్నాము, చనిపోతే బాగుండును అనుకొంటారు. భగవంతుడు ఇచ్చిన జీవితాన్ని శాపం క్రింద తీసుకొంటారు, వారికి జ్ఞానం రాదు. ఈ జీవితాన్ని భగవంతుడు ఇచ్చాడు. దీనిని శిక్షగా తీసుకోకూడదు. దీనిని భగవంతుడు మనకు ఇచ్చిన వరంగా తీసుకొని జీవితాన్ని సద్వినియోగం చేసుకొంటే మనకు జ్ఞానం కలుగుతుంది. మనమాటలో, మనచేతలో, మనతలంపులో భగవంతుని మర్చిపోకూడదు. భగవంతుని ముందు పెట్టుకొని మనం వెనకాల ఉండాలి. భక్తులలో కూడా ఇక్కడ మాటలు అక్కడ, అక్కడ మాటలు ఇక్కడ చెప్పేవారు ఉంటారు, వారికి జ్ఞానం రాదు. కొంతమందికి సొంతబుద్ధి ఉండదు. వారిని రంపం పెట్టి కోసినా జ్ఞానం రాదు. సొంతబుద్ధిని కాపాడుకోలేనివాడు ఈ లోకానికి పనికిరాడు, పరలోకానికి పనికిరాడు. మీ ఇంట్లో ఉన్న ధనాన్ని ఎలా కాపాడుకొంటున్నారో అలా స్వంతబుద్ధిని కూడా కాపాడుకోండి. స్వంతబుద్ధి లేని వాడు ఎంత శ్రవణం చేసినా ప్రయోజనం లేదు. సొంతబుద్ధి ఉంటేనే గురువు చెప్పినమాటలు ఆబుద్ధికి పడతాయి. సొంతబుద్ధి అవసరం.

ఎవరైనా పొగిడితే మీకు సంతోషం వస్తుంది. అది ఒక ఫీలింగ్. వాడు మిమ్మల్ని పొగిడాడు అంతే మిమ్మల్ని సంతోషపడమని వాడు చెప్పలేదు. ఆ వికారం మీకు వచ్చింది. ఆ వికారం రాకుండా చూసుకోవటానికి మనో నిగ్రహం అవసరం. ఎవరైనా విమర్శిస్తారు అనుకోండి మీకు దుఃఖం వస్తుంది. అది కూడా ఫీలింగ్. పొగిడినప్పుడు సంతోషం వచ్చినా, విమర్శించినప్పుడు దుఃఖం వచ్చినా మీ స్వరూపానికి దూరమవుతారు. సుఖం

ఒక ఫీలింగ్, కష్టం ఒక ఫీలింగ్. సుఖం వచ్చినప్పుడు నేను సుఖపడుతున్నాను, కష్టం వచ్చినప్పుడు నేను కష్టపడిపోతున్నాను అనే ఫీలింగ్ లేకుండా ఉంటే రోజూ పూజలు, జపాలు చేసేవారికంటే మీరు వికాశము పొందుతారు. ఆధ్యాత్మికంగా అభివృద్ధిలోనికి రావటానికి వినయం చాలా ముఖ్యం. వినయం ఉన్నవాడు ఆధ్యాత్మికంగా అభివృద్ధిలోనికి వస్తాడు, గర్వం ఉన్నవాడు వెనక్కి పోతాడు. మీరుజ్ఞానా అని ఈమధ్య ఒకరు అడిగారు. జ్ఞానం 'నేనే', అజ్ఞానం 'నేనే' అని చెప్పాను. జ్ఞానం అంటే తెలియటం, అజ్ఞానం అంటే తెలియకపోవటం. తెలియటం, తెలియకపోవటం అనేవి మనస్సులో ఉన్నాయి. రెండూ మనోధర్మములు. ఆ మనస్సును దాటితే నీకు సత్యజ్ఞానం కలుగుతుంది. మనస్సుతో గ్రహించే విషయంములు అన్నీ మిధ్యాజ్ఞానం. నీవు ఎవరిగా ఉన్నావో అది నీ అనుభవంలోనికి రావటం ఒక్కటే సత్య జ్ఞానం. జ్ఞాని ఒక్కటిగానే ఉంటాడు. అక్కడ ద్వైతం ఉండదు. ఆత్మసిద్ధికలిగినప్పుడు ద్వైతబుద్ధి నశిస్తుంది. ద్వైతం మనోకల్పితం. నీవు బాగా జపం చేస్తున్నావు అనుకో, నీవు బాగా ధ్యానం చేస్తున్నావు అనుకో నీకు సిద్ధులు కలుగవచ్చు. అక్కడ ఆగిపోతే, అదే గమ్యం అనుకొంటే నీ పురోగతి ఆగిపోతుంది. నీకు సిద్ధులు కలిగినా భయం ఉంటుంది. అభయస్థితి కలిగినప్పుడు భయం పోతుంది. అభయ స్థితి ఎక్కడ ఉంది అంటే ఆత్మలోనే ఉంది. తపోనిష్టవలన, జపం వలన, మంత్రం చేయటం వలన నీకు సిద్ధులు కలుగవచ్చు. ఇవి ఆత్మానుభవం కలిగించే సాధనాలు కావు. సిద్ధులు కలిగినంత మాత్రంచేత ఆత్మ జ్ఞానం కలుగుతుంది అనుకోవద్దు. పరమపవిత్రుడికిగాని, త్యాగపురుషుడికిగాని ఆత్మజ్ఞానం కలుగదు. కొంతమందికి ఎన్ని ఏళ్ళు వచ్చినా సరియైన స్నేహాలు దొరకకపోతే మనోవికాసం రాదు. మనస్సులోనే వికాశం లేనప్పుడు ఆత్మనిష్ట ఎలాగవస్తుంది. నీకు కష్టపడే పరిస్థితులు వచ్చినా ఆ ఫీలింగ్ రాకుండా ఉంటే మనోవికాసం కలుగుతుంది. ఆత్మసాక్షాత్కారం కలిగిన తరువాతకూడా కొంతమందికి సహజంగా సిద్ధులు వస్తాయి. వాటి వలన ప్రమాదం లేదు. ఏ భగవంతుడు అయితే నాకు జ్ఞానాన్ని ఇచ్చాడో వాడే ఈ సిద్ధులు కూడా ఇచ్చాడు అనుకొంటాడు గాని వాటితో తాదాప్యం పొందడు. ఆత్మజ్ఞానమే నిజమైనసిద్ధి. ఆత్మజ్ఞానం కలిగితే వాడికి తెలియకుండానే వాడి ద్వారా లోకానికి మేలు జరుగుతుంది. జరిగిపోయిన గొడవలు అన్నీ మర్చిపోవటం కూడా ఒక యోగంతో సమానము. దానివలన కాలం కలసివస్తుంది, శక్తి కలిసి వస్తుంది. ఇతరులు మీపట్ల ఎలా ప్రవర్తిస్తున్నప్పటికి వారి పట్ల మీ బుద్ధి నిర్మలంగా ఉంది అనుకోండి వారి ప్రభావం మీ మీదపడదు. సాధన అంటే ఏదో శాస్త్రాలు చదవటం కాదు, మీ మనస్సును ఎప్పుడూ సమానంగా ఉండేటట్లు చూసుకొంటూ ఉండాలి. గౌరవం వచ్చినప్పుడు మీ మనస్సు ఎలా ఉంది, అగౌరవం వచ్చినప్పుడు మీ మనస్సు ఎలా ఉంది, ధనం ఉన్నప్పుడు ఎలా

ఉంది, ధనం లేనప్పుడు ఎలా ఉంది, మనస్సు సమానంగా ఉందా లేక గాడి తప్పుతోందా అనేది చూసుకొంటూ ఉండాలి. అదే సాధన. సర్వత్రా నారాయణుడిని చూసేవాడికి ఇంకవికారం వచ్చే సమస్యలేదు. ఉన్నది ఒక్కటే అయినప్పుడు ఎక్కువాలేదు, తక్కువా లేదు. జ్ఞానం కలిగిన వాడు సిద్ధులు కోరుకోడు. సిద్దులు కలిగినవాడు జ్ఞానాన్ని కోరుకొంటాడు. ఎందుచేతనంటే లోపల ఉన్న కొరత వాడికి తెలుస్తూ ఉంటుంది. సిద్దులవైపుకు నీ మనస్సును పెట్టకు, జ్ఞానం కోసం జీవించు.

మీ మనస్సును భగవంతునికి ఇచ్చివేస్తే ఇంక కోరటానికి ఏమీ ఉండదు. మనం మనస్సును భగవంతునికి ఇవ్వటం లేదు, ఇచ్చినట్లు నటిస్తున్నాము. జీవితంలో శుభం వస్తు ఉంటుంది, అశుభం వస్తూ ఉంటుంది. వాటి తాలుక ప్రభావం లేకుండా ఉండగలిగితే సహజస్థితి నిన్ను వరిస్తుంది. శుభం యొక్క ప్రభావం, అశుభం యొక్క ప్రభావం నీ మనస్సు మీద పడనప్పుడు కదా నీవు నిజమైన భక్తుడవు అవుతావు. కొంతమంది ఎలా ఉంటారు అంటే భౌతికంగా ఇతరులకు సహాయం చేయనక్కరలేదు కనీసం వారు బాగుపడాలి అని మనస్సులో కూడా కోరుకోరు. అటువంటి వారు జీవించినా మరణించిన వారితో సమానము అని పెద్దలు చెపుతారు. మాకోడలు చెడ్డది అని అల్లరి పడేకంటే ఆ పరిస్థితులను అర్థం చేసుకొని తదనుగుణంగా మీరు ఉంటే ఏ గొడవ లేదు. పరిస్థితులు అర్థం చేసుకోకుండా రోడ్డమీద పడితే వారు అల్లరిపడటం, మీరు అల్లరిపడటం తప్ప ప్రయోజనం లేదు. కొంతమందికి వారి పొట్టగొడవ తప్పించి ఇంక ఏమీ ఉండదు. అటువంటి వారు బంధంలో కూరుకొనిపోతారు. ఆలోచించకుండా ఎవడూ ఏపని చేయడు. ఏ పని చేసినా సమగ్రంగా ఆలోచించుకొంటాడు. అలాగే మీరు దేనినైతే పొందాలి అనుకొంటున్నారో దానిగురించి స్పష్టమైన ఆలోచన ఉండాలి. స్పష్టమైన ఆలోచన లేకపోతే ఎటుగాలి వీస్తే అటు పోతూ ఉంటారు. బ్రహ్మం అంటే ఏమిటి? మనం పొందవలసింది ఏమిటి? మన గమ్యం ఏమిటి? అని స్పష్టమైన అవగాహన ఉండాలి. అవగాహన చేసుకొన్న తరువాత ప్రాక్టీసు చెయ్యాలి. ప్రాక్టీసు చేసేటప్పుడు మనకు అనేక ఆటంకాలు వస్తాయి. ప్రాక్టీసు చేసేటప్పుడు వైరాగ్యం ఉండాలి. వైరాగ్యం లేకపోతే ఆటంకాలను తట్టుకోలేక వెనుకకు వచ్చేస్తాము. ప్రాక్టీసుతోపాటు వైరాగ్యం ఉంటే మనం విజయం సాధిస్తాము; గమ్యాన్ని చేరతాము. మీ అవగాహన సక్రమంగా ఉంటే తక్కువ ప్రయత్నంతో ఎక్కువ లాభం పొందవచ్చు.

మనం ఏదైనా పని చేసేటప్పుడు అది భగవంతుడి ప్రీతికోసం చేస్తున్నామా లేక లోకంలో గొప్పలకోసం చేస్తున్నామా అని చూసుకోవాలి. నీవు బాహ్యంగా చేసే పనులను భగవంతుడు చూడడు. నీవు చేసే పూజ, జపం చూసి భగవంతుడు మోసపోడు. నీ

జీవిత విధానాన్ని చూస్తాడు. నీవు ధర్మాన్ని ఎంతవరకు ఆచరిస్తున్నావో చూస్తాడు. నీవు ఎవరికైనా సేవ చేసేటప్పడు ఆసేవను భగవంతుడు చూడడు, అది చేసేటప్పడు నీ తలంపు ఎలా ఉంది అని చూస్తాడు. దానిని బట్టి నీ ఆధ్యాత్మిక అభివృద్ధి ఆధారపడి ఉంటుంది. నీకు మోక్షం తిప్పించి లోకానికి సంబంధించిన ఏ సిద్దులు వచ్చిన అవి నీ మనో చాపల్యం పెరగటానికి పనికివస్తాయి. కొంతమంది ఎంతబుద్ధిమంతులు ఉంటారు అంటే ఎవరితోనైనా పొరపాటుగా మాట్లాడితే వారి ఇంటికి వెళ్ళి మేము పొరపాటుగా మాట్లాడాము ఏమీ అనుకోవద్దు అని చెప్పి వస్తారు అంతేగాని ఏదో కనిపించినప్పడు చెప్పటం కాదు. అటువంటి వారికి మోక్షం వరిస్తుంది. నీ మాట ఈశ్వరార్పితంగా ఉండాలి, నీచేత ఈశ్వరార్పితంగా ఉండాలి, నీ ఆలోచన ఈశ్వరార్పితంగా ఉండాలి. అలా ఉంటే నీకు దొరికేది ఈశ్వరుడే. నీవు ఎవరికైనా పండు ఇస్తున్నావు అనుకో ఇచ్చేవాడు ఈశ్వరుడు, పుచ్చుకొనేవాడు కూడ ఈశ్వరుడే అనుకోవాలి. మనం అలా అనుకోము నేను ఇస్తున్నాను, వాడు పుచ్చుకొంటున్నాడు అనుకొంటాము అక్కడ నుండి బంధం ప్రారంభమవుతుంది. నువ్వు ఇవ్వగలిగావు అంటే ఈశ్వరుడు నీకు ఇచ్చాడు కాబట్టి నీవు ఇస్తున్నావు ఆయన ఇవ్వకపోతే నీకు ఎలా వస్తుంది.

ఒక మంచి పని చేసేటప్పడు నలుగురు విమర్శించవచ్చు. విమర్శను పట్టుకొని పని మానివేయవద్దు. ఈవేళ సాధన ప్రారంభించి వెంటనే మోక్షం వచ్చేయాలని అనుకోవద్దు. పరిణామంలో వస్తుంది. మంచి చేసినవాడికి దుర్గతి లేదు ఆ ఫలం ఎప్పడు, ఎక్కడ, ఎలా ఇవ్వాలో భగవంతుడు చూస్తాడు. వివేకంగలవాడు, బుద్ధి సూక్ష్మత ఉన్నవాడు జ్ఞాన సముపార్జన వైపు తప్పించి మొఖాన్ని అటు ఇటు తిప్పడు. ఇవాళ పచ్చగా ఉండి రేపు ఎండిపోయే విషయాల మీద మోజు ఎందుకు? సిద్దులు, మహిమలు ఎలాగ వచ్చాయో అలాగే పోతాయి. ఏది శాశ్వతమో, ఏది జనన మరణ చక్రం నుండి నిన్ను విడుదల చేస్తుందో దానిమీద నీ మనస్సును పెట్టు. అజ్ఞానంలో ఉన్నప్పడు సిద్దులు ప్రదర్శించాలని, లోకంలో అందరూ మెచ్చుకోవాలని అనుకొంటాడు. దానివలన అహంభావన పెరుగుతుంది. మెచ్చుకొంటే గర్వం, మెచ్చుకోకపోతే బాధ పెరుగుతుంది. మెప్పలు కోరేది మనస్సు, మెచ్చుకోవటానికి ఇతరులు ఉండాలి. ఆత్మకు ఇతరులు లేరు. వీడికి మనస్సు ఉంది కాబట్టి అది మెప్పలు కోరుతోంది అది అజ్ఞానంలో ఉన్నవాడికి తెలియదు. అజ్ఞానంలో ఉన్నప్పడు ఇతరులు తనను మెచ్చుకోకపోతే బాధ, ఒకవేళ తనకంటే ఎక్కువ సిద్దులు ఉన్నవాడు కనిపిస్తే వాడిమీద అసూయ, కోపం ఇన్నిరకాల గొడవలు ఉంటాయి. ఇది అంతా మాయ. అన్నింటికంటే శాంతినిచ్చేది, మహోన్నతమైనది ఆత్మసిద్ధి దానిని పొందటానికి ప్రయత్నించు.

## మన హృదయంలో ఉన్న బ్రహ్మమును అనుభవంలోనికి రాకుండా చేసేది "నేనుదేహము" అనే తలంపు

ది. 14-11-2000న భీమవరంలోని గునుపూడి భీమేశ్వరస్వామి వారి ఆలయంలో రమణ భక్తులు ఏర్పాటుచేసిన ఆధ్యాత్మిక వేదికపై సద్గురు శ్రీ నాన్నగారు ప్రసంగించారు.

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

బహుజన్మల కృషి ఫలితంగా భక్తి వస్తుంది. భక్తి అంటే చిన్నవిషయం కాదు. భక్తిలేనివారు అది సామాన్యం అనుకొంటారు, వారే భక్తిని సంపాదించాలనుకొంటే అందులో ఉన్న కష్టం తెలుస్తుంది. ఈశ్వరునిపట్ల మన హృదయంలో ఉన్న ప్రేమనే భక్తి అంటారు. మీ పిల్లల మీద, మీభర్త మీద మీకు ప్రేమ ఎలా ఉందో అలాగ ఈశ్వరుని పట్ల ప్రేమ సహజంగా ప్రవహించాలి. దానికి ఎంతో కృషి ఉండాలి. ఏదో పూజ చేసాము, జపం చేసాము అంటే సరిపోదు, అంతమాత్రంచేత భక్తి వస్తుంది అనుకోవటానికి వీలు లేదు. ఈశ్వరానుగ్రహం ఉండాలి. దానిని పొందటానికే పూజ, జపం, ధ్యానం. భగవంతుని సంకల్పమే మన సంకల్పం చేసుకొని జీవించాలి. భగవంతుడు ఒకమాట చెపితే అదిమీకు ఇష్టం లేకపోయినా ఆచరించాలి. అప్పుడు భక్తి కలుగుతుంది. ధర్మాన్ని ఆచరించగా, ఆచరించగా అప్పుడు భక్తి మన హృదయంలోనుండి ఉబికి, ఉబికి వస్తుంది. ఈశ్వరుడి పట్ల మనకు ఉన్న భక్తి ఆత్మజ్ఞానాన్ని కలుగజేస్తుంది. భక్తిని అభివృద్ధి చేసుకొంటే మీకు తెలియకుండానే మీలో ఉన్న పునర్జన్మ హేతువులు రాలిపోతాయి. చాలాకాలం నుండి సాధనచేస్తున్నాము కాని మాకు భక్తి కలగటం లేదు అని కొంతమంది అంటారు. చాలామందికి గర్వం ఉంటుంది పైకి కనబడదు. ఆ గర్వం ఈశ్వరుని మీద భక్తిని అభివృద్ధి కానివ్వదు. గర్వం ఉన్నవాడికి మనోవికాశం కలుగదు, చైతన్యస్థాయి పెరుగదు. ఈ లోకంలో దేనితో తాదాప్యం పొందటం వలన నీకు గర్వం వస్తోందో అది అంతా సున్నా, అది స్వప్న సమానం అని నీకు తెలియకపోవటం వలన గర్వం వస్తోంది. మీకు ఉన్న చదువును బట్టి, మీకు ఉన్న ధనాన్ని బట్టి మీకు గర్వం వస్తూ ఉంటుంది. ఏ విషయాలను చూసి మీకు గర్వం వస్తోందో అవి స్వప్న సమానమని తెలిస్తే మీకు గర్వం రాదు. భక్తియొక్క వికాశం ఎలా ఉంటుంది అంటే నారాయణుడు దర్శనం ఇచ్చినప్పుడు ధ్రువుడు ఒకమాట అంటాడు నాపినతల్లి నన్ను అవమానం చేసింది. నాపినతల్లి చేత అవమానం చేయించినవాడవు నువ్వే ఆ అవమానం భరించలేక నీ పాదాలను ఆశ్రయించాను. నీ పాదాలను ఆశ్రయించేటట్లు చేసినవాడవు నువ్వే. ఇప్పుడు నాకు దర్శనం ఇచ్చి మోక్షం ఇచ్చేవాడవు నువ్వే అన్నీ నువ్వే. ముందునాకు తెలియక పినతల్లి ఏదో అంది అనుకొన్నాను. ఇప్పుడు అర్థమవుతోంది నా పినతల్లి చేత ఎందుకు అవమానించావు అంటే నీ పాదాలను

ఆశ్రయించటానికే అలా చేసావు. నా పినతల్లి చేత అవమానం చేయించవు అనుకో నేను నీ పాదాలను ఆశ్రయించను. నాకోసం ఇది అంతా చేసావు. ఇది అంతా చేసిన వాడవు నువ్వే. అది పూర్ణ శరణాగతి.

గురువుయందు ప్రేమ ఉండాలి, ఎవరో విమర్శించారని మనం కూడా గురువును విమర్శిస్తే సంపాదించిన భక్తి పోతుంది. గురువు యందు పూజ్య భావం లేకపోతే ఆయన చెప్పినది మనకు అర్థం కాదు. ఈశ్వరానుగ్రహం లేకుండా ఈశ్వరుడు చెప్పిన వాక్యం మనకు అనుభవంలోనికి రాదు. జీవుడు అంటే ఏమీలేదు. ఈ దేహమే నేను అనుకొంటున్నావు కదా అది ఒక తలంపు ఆ తలంపే జీవుడు. మన హృదయంలో ఉన్న బంగారం మనకు అనుభవంలోనికి రాకుండా చేసేది ఈ తలంపే. ఈ మొదటి తలంపును దాని మూలంలోనికి పంపగలిగితే దాని మూలం అది చూసిన వెంటనే అది నశిస్తుంది. అది నశిస్తే నీవు నశించవు. నీవు ఎవరో నీకు తెలుస్తుంది. అంటే బ్రహ్మమే నీకు తానుగా వ్యక్తమవుతుంది. అయితే ఏమి చేయాలంటే సద్వస్తువు అనుభవంలో ఉన్నవారితోటి, ఇతరుల క్షేమంకోరేవారితోటి ఎంతో కొంత మనం స్నేహాలు చేస్తూ ఉండాలి. నిజంగా అహంకారం మీద నమ్మకం ఉన్నంతకాలం ఈశ్వరుడిమీద నమ్మకం కలుగదు. అహంకారంలో ఉన్న నిస్సారత నీకు తెలిసినప్పడు, అందులో ఏమి సారం లేదు అదిపెంటతో సమానం అని నీకు తెలిసిన తరువాత ఈశ్వరుడి మీద నమ్మకం కలుగుతుంది. దేహము నేను అనే తలంపు వచ్చిన తరువాత అక్కడ నుండి కోరిక ప్రారంభమవుతుంది. కోరిక వచ్చాక కర్మ చేస్తాము. ఆ కోరిక నిన్ను బంధిస్తుంది. ఆ కోరిక ద్వారా చేసిన కర్మకూడా నిన్ను బందిస్తుంది. కర్మకూడా శత్రువే ఎందుచేతనంటే ఫలాపేక్షతో స్వార్థంతో నువ్వు చేసే ప్రతీపని నీకు విరోదమే దానివలన నీకు వికాసము రాదు, ఆత్మజ్ఞానము కలగటానికి నీకు అడ్డు వస్తుంది. మీరందరూ పనిచేస్తున్నారు. కాని మీరుచేసే పనే మీకు శత్రువు. ఎందుచేతనంటే ఆ పని ఈశ్వరుని ప్రీతికోసంగాని, సమాజ కళ్యాణం కోసంగాని చేయటంలేదు. నీ దేహయాత్రకు సరిపడ పనిచేసుకొంటూ మిగతా కాలం అంతా ఈశ్వరానుగ్రహం కోసం పనిచెయ్యి. పునర్జన్మలేకుండా చేసుకోవాలని ఉంది అని ఒకరు భగవాన్‌ను అడుగుతున్నారు. గాఢ నిద్రలో పునర్జన్మ గురించి ఆలోచిస్తున్నావా అన్నారు భగవాన్. లేదు అని చెప్పాడు. ఈ పునర్జన్మ గురించి, పూర్వజన్మ గురించి పుణ్య పాపాల గురించి, వైకుంఠం గురించి, కైలాసం గురించి ఆలోచించేది దేహము నేను అనే మొదటి తలంపే. దానిని నీవు దాటగలిగితే పునర్జన్మలగురించి ఆలోచించేవాడు ఎవడూ ఉండడు. మీకు ఎవరు ఇష్టం అంటే రాముడు అంటే ఇష్టం, శివుడు అంటే ఇష్టం అంటారు. కాని మాకు జ్ఞానం అంటే ఇష్టం, ఆత్మ జ్ఞానము పొందాలి అనుకొనేవారు చాలా తక్కువ మంది ఉంటారు. జ్ఞానం యొక్క వైభవం మనకు తెలియటం లేదు. నాకు భక్తి, జ్ఞాన,

వైరాగ్యములు ప్రసాదించమని మనం భగవంతుడిని అడగటం లేదు. దేహము నేను అనే తలంపు ఏ కోరికను తీసుకొని వస్తుందో ఆ కోరికను తీర్చమని అడుగుతాము.

ఎక్కువకాలం జీవించాలని అనుకోకూడదు. తొందరగా చనిపోవాలని అనుకోకూడదు. జ్ఞానానికి అదీ ఆటంకమే, ఇదీ ఆటంకమే. తర్కం వలన, చమత్కారాల వలన ఆత్మజ్ఞానం కలుగదు. వివేకంగా జీవించటం వలన, ధర్మాన్ని ఆచరించటం వలన ఆత్మజ్ఞానం కలుగుతుంది. నిన్ను నీవు తెలుసుకో అంటున్నారు ఎవరిని తెలుసుకో మంటారు అని భగవాన్‌ను అడుగుతున్నారు. నీవు ఎవరిగా ఉన్నావో వాడిని తెలుసుకో. నీవు బ్రహ్మం. కాని నీవు ఏమనుకొంటున్నావు నేను దేహమును, నేను మనస్సును అనుకొంటున్నావు ఇలా అనుకొన్నంతకాలం నీవు ఏదిగా ఉన్నావో అది నీకు తెలియబడదు. మనసుకు దూరమయితే బ్రహ్మంకు దగ్గరవుతావు. బ్రహ్మం ఇలా ఉంటుంది, అలా ఉంటుంది అని అనుకొంటావు. నీవు ఎలా ఉంటుంది అనుకొంటున్నావో అది అలా ఉండదు, అలా ఊహించుకోవద్దు. అది నీ మాటకు, మనస్సుకు అందదు, నీ అనుభవానికి అందుతుంది. అయితే దానిని పొందటానికి నీ మాటను, నీ మనస్సును, నీ ప్రవర్తనను సంస్కరించుకోవాలి. ఆత్మానుభవం పొందటానికి ఏ బలహీనతలు అడ్డువస్తున్నాయో వెతికి, వెతికి చూసుకోవాలి. ఇంట్లోపాము ఉంది అంటే ఇల్లు అంతా వెతుకుతాము. పాము కంటే మన ఇంద్రియాలు ప్రమాదకరమైనవి. పాము కాటేస్తే ఈ శరీరం పోతుంది. కాని మన ఇంద్రియాలు ఏ జన్మకు ఆజన్మ మనలను కాటేస్తూ ఉంటాయి. చెడుతలంపులే మనల్ని బంధిస్తాయి. ఎదుటివారికి ఏదైనా చెడ్డ జరిగితే బాగా జరిగింది అనుకొంటే ఈ జన్మలో కాకపోయినా మరోజన్మలో అయినా ఆచెడ్డ నీకు వస్తుంది. అందుచేత తలంపుల విషయంలో జాగ్రత్తగా ఉండాలి. కాలము, కామము కల్పించేది మనస్సు. సంకల్పం వచ్చాక కాలం, కామం వస్తాయి. ఆ కాలాన్ని, కామాన్ని జయించిన జీవుడే శివుడవుతాడు. ఈ రెండింటిని జయించటానికి శివుడిని ఆరాధించాలి. శివుడు కాలాన్ని, కామాన్ని జయించాడు కాబట్టి ఆస్థితిని మనకు అనుగ్రహిస్తాడు. కోరికలేనివాడు పనిచేస్తుంటే ఆపని కూడా ధ్యానంతో సమానము. పునర్జన్మలు కల్పితాలు. వాటి గొడవవద్దు. ముందు దేహమునేను అనే తలంపు నుండి బయటకురా. అందులోనుండి బయటకురాకపోతే ఇంకోదేహంలోనికి వెళ్ళినతరువాత ఆ దేహమే నేను అనుకొంటావు. పునర్జన్మ, పునర్జన్మ అంటున్నారు. అది ఎక్కడ ఉంది? అహంకారంలో ఉంది. దానిలోనుండి బయటకు వస్తే ఈ జన్మలగొడవలేదు. ఈ శరీరం ఉండగానే అహంకారమును దాటి చైతన్యములోనికి వెళ్ళటమే నిజమైన పునర్జన్మ. అహంకారంలో ఉన్నంతకాలం ఏ జన్మకు ఆజన్మ ఆశరీరం నిజం అనుకొంటావు, దానితో తాదాప్యం పొందుతావు. దానిని తెగనరికేవాడే గురువు, దేహాభిమానాన్ని

అలంకరించేవాడు నీ గురువు కాదు. దేహాభిమానాన్ని వైరాగ్యం అనే అస్త్రంతో తెగనరికేవాడే నీ గురువు. దేనితో అంయితే సాధన చేస్తున్నావో దానిని తొలగించుకోవటానికి ప్రయత్నం చెయ్యి, దానిని అలంకరించుకోవటానికి ప్రయత్నం చేయవద్దు అని భగవాన్ చెప్పారు. రామకృష్ణుడు శిష్యులలో రామకృష్ణానంద అని ఒకరు ఉన్నారు. ఆయన దగ్గర మనం భక్తికి సంబంధించిన మాటలు తప్ప ఏదైనా లోకవిషయాలు చెపితే మీరు వెళ్లిపోండి అని చెప్పేవారట. ఆయనకు జ్ఞానంపట్ల ఉన్న కాంక్ష అటువంటిది. ఆయనకు రామకృష్ణుడి పాదాలను ముట్టుకోవాలని ఉండేదట. రామకృష్ణుడు ఆయనను పరీక్ష చేయటానికి ఆయన వచ్చేటప్పటికి పాదాలను ముడుచుకొని కూర్చొనేవారట. అలా నాలుగు సార్లు చేసారు. తర్వాత 5వసారి మామూలుగా కాళ్ళు చాపుకొని కూర్చొన్నారట ఆయన వచ్చి పాదాలకు నమస్కరించారట. అప్పుడు రామకృష్ణుడు చెప్పాడు 4,5 సార్లు నీ కోరిక భంగం చేసాను. నా మీద విరక్తి వస్తుందేమో అని చూసాను. నా మీద నీకు గౌరవం రవ్వంతకూడా పోలేదు, పూజ్యభావం నిలబడింది అందుకే పాదాలను ఇస్తున్నాను నమస్కరించుకో అనిచెప్పారు.

చనిపోయిన తరువాత ఈ జీవుడు ఏమౌతాడు అని అడుగుతున్నారు. చనిపోయిన తరువాత గొడవెందుకు. ఇప్పడే ఈ జీవుడు ఎవడో విచారణ చేసి తెలుసుకో. అది తెలుసుకొంటే చావు అనేది లేదు అని నీకు అర్థమవుతుంది. ఈ జీవుడే ఒక సమస్య. అదే అన్ని సమస్యలను కల్పిస్తుంది. దానిని నీ అంతట నువ్వు పరిష్కరించుకోవాలి. ఆ ప్రయత్నంలోనే జీవుడు అనేవాడు లేడు అని నీకు తెలుస్తుంది. ఈ సమస్య ఎవరో పది రూపాయలు ఇవ్వటం వలన పోదు. ధనం వలన దారిద్ర్యం పోతుందిగాని ఈ నేను అనే సమస్య పోదు. దానిని నీవే పరిష్కరించుకోవాలి. దానికి సత్పురుషులు, గురువులు సహాయం చేస్తారు. మనకు అవినయం ఉండకూడదు. అవినయం సాధకుడిని సరి అయిన పద్ధతిలో నడవనివ్వదు. మేము పైకి వచ్చాము అని చెప్పేవారే గాని మేములోపలకు వెళ్ళాము అని చెప్పేవారు కనబడటంలేదు. దేవుడుపైన లేడు, లోపల ఉన్నాడు. అవినయం, గర్వం, పొగరుబోతుతనం తగ్గాలంటే ఎవరిలో ఏ మంచి ఉన్నా మనం నేర్చుకోవటానికి ప్రయత్నం చేయాలి. వారిలో ఏదైనా చెడ్డ ఉంటే వదిలివేయాలి. అప్పుడు మనం పవిత్రులమవుతాము. అప్పుడు అవినయం, గర్వం తగ్గిపోతాయి. ఇతరులలో ఉన్న చెడ్డను చూస్తే మనం చెడ్డవారమవుతాము, మంచిని చూస్తే మంచివారమవుతాము. ఒకటి మాత్రం గుర్తుపెట్టుకోండి మంచితనం లేనివారికి జ్ఞానం కలుగదు. ఎవడికి మోక్షం వస్తుంది అంటే పొందవలసిన కర్మానుభవం ఇంక ఎవడికైతే మిగలదో వాడికి మోక్షం వస్తుంది. బహుమానాలకంటే అవమానాలే మీ మనస్సును అంతర్ముఖ పరుస్తాయి. అలా అని అవమానాలు కొని తెచ్చుకోకండి, సహజంగా వస్తే భరించండి. జన్మలగొడవ మీకు వద్దు, దేనిని పొందాలో దానిమీద మీ దృష్టిని పెట్టుకోండి.

05-12-2000

## అరుగు మీద ఆత్మబోధ

**ది. 1-12-2000 గం. 04-15 ని.లకు**

పృచ్ఛకుడు: మీ సన్నిధిలో వచ్చిన ఆత్మ శాంతి మనస్సులోనేగాక, శరీరంతో గూడ పరవళ్ళు తొక్కుతోంది దానివల్ల జడమైన శరీరము కూడ పులకించిపోవటం ఆశ్చర్యముగా ఉన్నది.

నాన్నగారు: దీనిలో ఆశ్చర్యపడవలసినది లేదు మానసిక వత్తిడి ఉన్నప్పడు దాని ప్రభావం శరీరము మీద ఉన్నట్లే, మనస్సు శాంతిగా ఉన్నప్పడు దాని ప్రభావం శరీరం మీద తప్పక ఉంటుంది. మానసిక వత్తిడి ఉన్నప్పడు ఉచ్వాస నిస్వాసములు దీర్ఘంగా ఉంటాయి. మనస్సు శాంతిగా ఉన్నప్పడు ఉచ్వాస నిస్వాసములు సహజముగా, మన ప్రయత్నము లేకుండా నియమింపబడి ఉంటాయి. దీనివల్ల దేహము ఆరోగ్యముగా ఉండును, మనస్సులో నిండిన శాంతి నరముల ద్వారా (Nerves) శరీరము అంతటను వ్యాపించును.

పృచ్ఛకుడు: శాంతి వలన కలిగిన శరీరపు పులకింతనాకు అప్పడప్పడు మాత్రమే కలుగుచున్నది.

నాన్నగారు: మన అంతరంగములో మనము మునిగినప్పడు శరీరము ఎల్లప్పడు ఆ స్థితిలోనే వుండి శరీరము కూడా ఆత్మమయమై, ఆనందమయ స్థితిలో ఉండును.

పృచ్ఛకుడు: అటువంటప్పడు, ఆత్మ, మనస్సు, శరీరము, అనే బేధములేక అన్నీ ఆత్మమయముగానే ఉండి, ఇంక మానసిక సంఘర్షణ (Conflict) ఉండదు.

నాన్నగారు: అవును.

## సమాజసేవ ద్వారా భగవంతుని ఆరాధించవచ్చు

సద్గురు శ్రీ నాన్నగారు ది. 01-12-2000 శుక్రవారం పాలకొల్లులోని చాంబర్ కళాశాల ప్రాంగణంలో కారుమూరి పార్వతీశ్వర మామిళ్లయ్య సూర్యాకాంతం




కళామందిరాన్ని ప్రారంభించారు. సభనుద్దేశించి భగవంతుని చేతులతో ఆరాధించుట కంటే బాధలో ఉన్న సాటి మనిషిని ఆదుకొంటే దైవత్వం సిద్ధిస్తుందని సద్గురు శ్రీ నాన్నగారు ప్రవచించారు. యజ్ఞం చేస్తామంటే లక్ష రూపాయలు ఇచ్చేవారు బడికి కనీసం వేలుకూడా ఇవ్వరని అన్నారు. ఈ కళాశాలకు పిజి కోర్సులు తేవటానికి దాతలు ముందుకు రావాలని కోరారు. ఈ కళాశాల భవిష్యత్తులో మినీ యూనివర్శిటీగా అభివృద్ధిలోకి వస్తుందని ఆయన ఆశీర్వదించారు.

## పాఠకులకు మనవి


పోస్ట్‌మాస్టర్ జనరల్, విజయవాడ వారు రమణభాస్కర ఆధ్యాత్మిక పక్ష పత్రికకు పోస్టల్ పర్మిషన్ సాంక్షన్ అయినట్లుగా తెలియపర్చినారు. ఈ సందర్భంగా ఎవరికయిననూ ఈ ప్రతులు అందనిచో మీరు మీ రశీదు నంబరు, పూర్తిపేరు, ఇంటి నంబరు, వీధి పేరు, వూరు పేరు, మండలం పేరు, జిల్లా పేరు, పిన్ కోడ్ తప్పని సరిగా వ్రాసి మాకు పంపిన యెడల మేము బాధ్యత వహించి మీకు ఈ ప్రతులు అందునట్లు చేయగలవారము.

మీ చిరునామాలో మార్పు ఉంటే దయచేసి వెంటనే మాకు తెలియజేయండి. ఆవిధముగా తెలియజేసినచో పత్రిక నేరుగా మి క్రొత్త చిరునామాకు వచ్చి చేరుతుంది. మాకు వ్రాసే ఉత్తరాలలో మీ చందా రశీదు నెంబరును తెలియపరచడం మరువకండి.


అరుణాచల దీపోత్సవం
ది. 09-12-2000
సాయంత్రం గం. 6-00లకు



శ్రీ రమణాశ్రమం, తిరువన్నామలై



ఆంధ్రాశ్రమం, తిరువన్నామలై



శ్రీ రమణ క్షేత్రం, జిన్నూరు

**BOOK PKTS. CONTAINING PERIODICALS**

RNI No.APTEL/1999/1667

To

*If undelivered please return to :*

**RAMANA BHASKARA**
SRI RAMANA KSHETRAM,
**JINNURU - 534 265.** W.G. Dt. A.P.

Chief Editor, Printer, Publisher, Owner **P.S. RAMA RAJU**
Lakshmi Modern Rice Mill, Ullamparru, PALAKOL - 534 260. W.G. Dt. ☎ : 08814-24589, 24689
Printed at : **SHRIRAM GRAPHICS**, Bank Street, PALAKOL - 534 260. W.G. Dt. ☎ : 22438, 24278